క్లుప్తంగా

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని గైనకాలజిస్ట్ సీహెచ్ ఇందిర చెప్పారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) విజయవాడ బ్రాంచ్ కార్యాలయం ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మహిళల ఆరోగ్యంపై అవగాహన సదస్సు జరిగింది. ఇందిర.. మహిళలు శారీరకంగా, మానసికంగా బలంగా ఉండటం అనే అంశంపై మాట్లాడారు. మహిళలు చిన్నపాటి అనారోగ్య సమస్యను కూడా నిర్లక్ష్యం చేయొద్దన్నారు. నిత్యం ఆకుకూరలు, కూరగాయలు, తాజా పండ్లు తినడంతో పాటుగా కొద్ది పాటి వ్యాయామం చేయడం ద్వారా శరీరాన్ని మనస్సును ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని చెప్పారు. వృత్తిని, జీవితాన్ని బ్యాలెన్స్ చేయడం అనే అంశంపై చార్టర్డ్ అకౌంటెంట్ వై.లక్ష్మీవాళ్సల్య మాట్లాడుతూ మహిళలు ఉన్న వృత్తితో పాటుగా జీవితాన్ని బ్యాలెన్స్ చేస్తుండాలన్నారు. వేడుకల కో–ఆర్డినేటర్, ఐసీఏఐ విజయవాడ బ్రాంచ్ పూర్వ అధ్యక్షురాలు జీ.శ్రీతా సీరేన్ మాట్లాడారు. ఐసీఏఐ సభ్యులకు, సీఏ విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. ఐసీఏఐ విజయవాడ శాఖ చైర్మన్ నిట్టా రవికిషోర్, వైస్ చైర్మన్ కె.నారాయణ, కార్యదర్శి ఉప్పులూరి జయంత్ తదితరులు మాట్లాడారు. ఇందిర, లక్ష్మీ వాళ్సల్యను ఐసీఏఐ ప్రతినిధులు సత్కరించారు.

భక్తులను రంజింపజేసిన భజన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహా శివరాత్రి పురస్కరించుకుని అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై కాటూరు గ్రామానికి చెందిన శ్రీ ఈశ్వరి భక్త సమాజానికి చెందిన కళాకారుల భజన భక్తులను రంజింపజేసింది. శుక్రవారం కళావేదికపై భక్త సమాజం గురువు గుమ్మడిదల వీర వెంకటేశ్వరరావు, మహేశ్వరి తమ శిష్యబృందంతో పలు అమ్మవారి కీర్తనలను ఆలపించారు.

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని రమణీయంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక ఏర్పాటు చేసిన కల్యాణవేదికపై ఉత్సవ మూర్తులను మేళతాళాలతో తీసుకొచ్చి అధిష్ఠింపజేశారు. అనంతరం విష్వక్సేనపూజతో కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. భక్తుల హరి నామస్మరణ, మంగళవాయిద్యాలు, అర్చకుల మంత్రోచ్చరణల మధ్య స్వామి వారి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. కార్యక్రమాలను ఆలయ అర్చకులు పీ శ్రీరామచంద్రమూర్తి నిర్వహించారు.

శాస్త్రోక్తంగా తిరుమంజనం

స్వామి వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి వారి మూలమూర్తికి తిరుమంజన అభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పంచామృత, సుగంధ, ఫల రసాలతో స్వామి వారి మూలమూర్తులకు అర్చకస్వాములు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు.

మహిళల ఉన్నతే సమాజ ప్రగతి

అమెరికన్ ఆంకాలజీ హాస్పటల్ డాక్టర్ అనీల పాటిబండ్ల

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహిళల ఉన్నతే సమాజ ప్రగతి అని అమెరికన్ ఆంకాలజీ హాస్పటల్ డాక్టర్ అనీల పాటిబండ్ల పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని శుక్రవారం కానూరులోని అమెరికన్ అంకాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో ఘనంగా నిర్వహించారు. 'బ్రేకింగ్ ది బైయస్.. స్థానికత కోసం సమానత' అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అమెరికన్ అంకాలజీ వైద్య బృందం హాజరై హెచ్.పి.వి వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్, మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ ప్యాకేజీ ప్రారంభించారు. మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రాజేష్ కోట మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై విజయం సాధించిన మహిళలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఏఓఐ రీజనల్ సీఈఓ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా రూ.4వేలు విలువ కలిగిన క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు రూ.999 ప్యాకేజీ ద్వారా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సాయి కృష్ణ కొల్లూరు, ఏఓఐ జోనల్ డైరెక్టర్ పీవీఆర్ కిరణ్, డాక్టర్ శ్రీకాంత్ కోటగిరి పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బాలిక అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాత రాజరాజేశ్వరిపేటకు చెందిన ఆకుల జరీనా, శ్రీను దంపతులు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. రెండో కుమార్తె(15) పదో తరగతి చదువుకుని ఇంటి వద్దే ఉంటుంది. గురువారం ఉదయం జరీనా పనికి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేసింది. కుమార్తె కోసం చూడగా కనిపించలేదు. చుట్టు పక్కల వెదికినా ప్రయోజనం లేకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఓం నమో శివ రుద్రాయ..

- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి
- పరమశివుని దర్శనానికి 'పశ్చిమ'లో బారులు తీరిన భక్తులు
- ఓంకారనాదంతో మార్మోగిన శైవక్షేత్రాలు
- కనులపండువగా కల్యాణోత్సవాలు

మదిమదిలో మహేశ్వరుడిని స్మరిస్తుండగా.. అడుగడుగునా భక్తిభావం ఉప్పొంగగా.. దేదీప్యమానంగా ఆధ్యాత్మిక వెలుగులు విరాజిల్లుతుండగా.. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శుక్రవారం 'పశ్చిమ'లోని శైవక్షేత్రాల ఆవరణలు పులకించాయి. భక్తులు పరమేశ్వరుడి దర్శనానికి బారులు తీరి కనిపించారు. ఆలయాల్లో అభిషేక ప్రియుడికి బిల్వార్చనలు, ఏకాదశ రుద్రాభిషేకాలు, సహస్ర నామార్చనలు చేశారు. అర్ధరాత్రి ఆలయాల్లో స్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా చేశారు.



యనమలకుదురు రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తజన సందడి



వాగు సెంటర్‌లోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి



విజయదుర్గా రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో అర్ధనారీశ్వరుడు



పాతబస్తీలో భక్తులకు ప్రసాదాల పంపిణీ



నగరేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం



దుర్గాఘాట్ వద్ద క్యూలో వస్తున్న భక్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని శుక్రవారం వన్‌టౌన్‌లోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. వన్‌టౌన్‌లోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో (పాతశివాలయం) శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటలకు భక్తులను స్వామి వారి దర్శనానికి అనుమతించారు. అనంతరం భక్తులు అభిషేకార్చనకు బారులు తీరారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి భక్తులకు ఉచిత అన్నప్రసాదాన్ని అందజేశారు. రాత్రి లింగోద్భవ కాలం తర్వాత స్వామి వారి కల్యాణోత్సవాన్ని నేత్ర పర్వంగా నిర్వహించారు. ఉత్సవాల నిమిత్తం చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా నేల సంధ్యను దేవదాయ శాఖ నియమించింది. ఆమె ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ నగరేశ్వర వారి దేవస్థానంలో....

వన్‌టౌన్ శేషయ్య వీధిలోని శ్రీ కన్యకాపరమేశ్వరి నగరేశ్వరస్వామి వారి దేవస్థానం (కొత్తగుళ్లు) శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో పలు విశేష పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాలను కమిటీ ప్రముఖులు సాంబశివరావు, చెవిటి శ్రీనివాసులు, తదితరులు పర్యవేక్షించారు.

దర్భేశ్వరస్వామి వారి దేవస్థానంలో..

సైకంవారి వీధిలోని శ్రీ దర్భేశ్వరస్వామి వారి దేవస్థానంలో విశేష అర్చనలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ రాంపిళ్ల జయప్రకాష్ ఆధ్వర్యాన ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అర్చకస్వాములు మురళీ ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలు కొనసాగాయి.

- కేటీరోడ్డులోని శ్రీరామలింగేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో స్వామి వారికి పలు విశేష పూజలను నిర్వహించారు.
- కొత్తపేట కుమ్మరివీధిలోని శ్రీ పాండురంగ స్వామి వారి దేవస్థానంలో కొలువైన శ్రీపర్వత వర్ధని సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో మధ్యాహ్నం రుద్రహోమాన్ని నిర్వహించారు.

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): స్థానిక హర్టుపేటలోని శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో శ్రీ సోమనాథేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ కార్యదర్శి కృష్ణప్రసాద్, కమిటీ సభ్యులు శంకరావు, శ్రీనివాసు, చక్రవర్తి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిట్టినగర్ పరిధిలో..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేయస్వామి వారి ఆలయంలో శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వారికి సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, మధ్యాహ్నం ఒంటి గంటకు స్వామి వారికి కుంభాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావుశర్మ పూజలు చేశారు. ఆలయ ఈవో రావూరి వెంకటేశ్వరరావు చైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు, పాలక మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- భీమనవారి పేటలోని శ్రీ విజయదుర్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 8 గంటలకు విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చింతల పాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మలు కళ్యాణోత్సవాన్ని జరిపించగా, పలువురు ఉభయదాతలు భక్తులు పాల్గొన్నారు.
- చిట్టినగర్‌లోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయం ప్రాంగణంలోని శమీ కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరగగా, కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు.

భక్తులకు అన్న ప్రసాద వితరణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహాశివరాత్రి వేడుకలు పురస్కరించుకొని తరలివచ్చిన భక్తుల కోసం పాతబస్తీలోని శుక్రవారం నూకల మురళీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ శుక్రవారం చేశారు. దుర్గాఘాట్, పాతశివాలయం తదితర ప్రాంగణాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులకు కెనాల్‌రోడ్డు వద్ద ప్రసాదాల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ ప్రారంభించారు. కార్యక్రమంలో పెరుమాళ్ల శివ సుబ్రహ్మణ్యం, వందనం శ్రీనివాసరావు, నూకల నాగేశ్వరరావు, వక్కలగడ్డ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఆది దంపతులైన గంగాపార్వతీ సమేత పరమేశ్వరుని కల్యాణోత్సవాన్ని శుక్రవారం నేత్రపర్వంగా నిర్వహించారు.

పాతబస్తీలోని వివిధ ఆలయాల్లో స్వామి వారి కల్యాణోత్సవాలు శుక్రవారం రాత్రి వేళ అంగరంగ వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం), శ్రీ నగరేశ్వరస్వామి వారి దేవస్థానంతో పాటుగా పలు ఆలయాల్లో రాత్రి లింగోద్భవ కాలంలో స్వామి వారికి విశేష అభిషేకాలను నిర్వహించి అనంతరం కల్యాణోత్సవాలు జరిగాయి.

కెనాల్‌రోడ్డులో..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని కెనాల్‌రోడ్డు భక్తులతో కిక్కిరిసి పోయింది. దుర్గాఘాట్‌కు పవిత్ర స్నానాల నిమిత్తం వెళ్లే భక్తుల రాకపోకలు, ఆలయాలకు వెళ్లే జనంతో కెనాల్ రోడ్డు కిటకిటలాడింది. ఒకవైపు వివిధ సేవాసంస్థలు ప్రసాద వితరణ, భోజనం, అల్పాహారం వంటి ఆహార పదార్థాల పంపిణీలను చేపట్టడంతో భక్తులు కిక్కిరిసి కనిపించింది. వన్‌టౌన్‌లో భారీ బందోబస్తును చేపట్టారు. ఎక్కడా కూడా భక్తులకు అసౌకర్యం కలగకుండా వేగవంతంగా ముందుకు కదలడానికి వీలుగా పోలీసు శాఖ ఈ ఏడాది పటిష్టమైన బందోబస్తును నిర్వహించారు. గురువారం రాత్రి నుంచి సిబ్బంది విధుల్లోకి కొనసాగారు. బాంబుస్క్వాడ్ గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకూ తనిఖీలు నిర్వహిస్తూనేఉంది. అశోక్‌పిల్లర్ వద్ద ఉదయం ప్రజల రద్దీ అధికం కావడంతో ఘాట్‌లోని భక్తులను త్వరితగతిన బయటకు పంపించేందుకు ఏర్పాట్లు చేశారు.



అన్నదాన కార్యక్రమంలో పూజలు చేస్తున్న వెలంపల్లి, రాయన భాగ్యలక్ష్మి

దినవాహి సత్రం ఆధ్వర్యంలో అన్నదానం

పాతశివాలయం సమీపంలోని దేవదాయ శాఖకు చెందిన దినవాహిసత్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదానాన్ని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రారంభించారు.



దుర్గాఘాట్ వద్ద..



పాత శివాలయం వద్ద క్యూ



వన్‌టౌన్ భ్రమరాంబమల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో..

అందరికీ అండగా జగనన్న ప్రభుత్వం

- వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్
- రూ.18.70 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో అన్ని వర్గాలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటుందని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. శుక్రవారం 39వ డివిజన్ పరిధిలోని బరియల్ గ్రౌండ్‌లో రూ. 18.70లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర తో కలిసి ఆసిఫ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరంఆసిఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముస్లింల సంక్షేమానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసి మౌలిక సదుపాయాలు కల్పించిందన్నారు. భవానీపురంలో ఏ రోడ్డుకు వెళ్లినా అద్దల్లా మెరిసిపోతున్నాయన్నారు. ఇంతటి అభివృద్ధి గతంలో ఏ ప్రభుత్వం జరగలేదన్నారు. జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్, పార్టీ మైనార్టీ సెల్ నేత షేక్ హయాత్, వివిధ మసీదు కమిటీల ప్రముఖులు ఎస్‌బీఎస్ మౌలాలి, బాబు, బషీర్, కరీముల్లా, ముజిబ్, సుభానీ, షమ్మ, బీవీరెడ్డి, నయామ్, బడామియా తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న షేక్ ఆసిఫ్, గుడివాడ నరేంద్ర

మైనార్టీల వ్యతిరేకి చంద్రబాబు..

షేక్ ఆసిఫ్

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ముస్లిం వర్గాల వ్యతిరేకని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్‌ఆసిఫ్ చెప్పారు. శుక్రవారం కేదారేశ్వరపేటలోని గౌసియా మసీదులో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్‌గౌస్ మొహిద్దీన్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం మసీదు పెద్దలు వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ నాడు ప్రభుత్వ హయంలో గుంటూరులో జరిగిన నారా హమారా సభలో నినదించిన ముస్లిం యువతపై దౌర్జన్యం చేసి దేశ ద్రోహం లాంటి కేసులతో వేధించిన చంద్రబాబుకు మైనార్టీల సంక్షేమంపై మాట్లాడే అర్హత లేదన్నారు. మైనార్టీల పక్షపాతి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించాల్సిందిగా ముస్లిం పెద్దలను కోరారు. మసీదు పెద్దలు ముస్తఫా, ఇబ్రహిం, నజీర్, మన్సూర్, ఫారుక్ తదితరులు పాల్గొన్నారు.



కేదారేశ్వరపేటలో మసీదులో పెద్దలతో మాట్లాడుతున్న ఆసిఫ్

తోటి వారికి సాయపడాలి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తోటి వారికి సాయం చేసే అవకాశం రావడం అదృష్టంగా భావించాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ది ఏపీ స్టేట్ సభ్యుడు లయన్ చలసాని అజయ్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ హరిత ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం సమీపంలో రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న మంగమ్మ అనే మహిళకు రూ.11 వేలను శుక్రవారం అందజేశారు. చలసాని అజయ్‌కుమార్ హాజరై ఆమెకు నగదును అందచేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ హరిత అధ్యక్షుడు కోట శ్రీనివాసరావు, కార్యదర్శి ఫణి, లయన్స్ సభ్యులు యోగా మాస్టార్ అంకాల సత్యనారాయణ, కాకాని శ్రీనివాసరావు, రామకృష్ణ, రామయ్య, శ్రీనివాసరావు, బెజవాడ బార్ కౌన్సిల్ సెక్రటరీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న చలసాని అజయ్‌కుమార్, క్లబ్ సభ్యులు

మోకాళ్ల నొప్పులకు ఆక్యుపంక్చర్ సరైన వైద్యం



కానూరులో ఉచిత వైద్యం శిబిరం

పెనమలూరు: మోకాళ్ల నొప్పులకు ఆక్యుపంక్చర్ సరైన వైద్యమని యోగాశక్తి సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ మాకాల సత్యనారాయణ అన్నారు. కానూరు అశోక్‌నగర్‌లో మహాశివరాత్రి సందర్భంగా ఉచితంగా మోకాళ్ల నొప్పులకు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఆయన మాట్లాడుతూ ఆక్యుపంక్చర్ వైద్యంతో ఎటువంటి ఆపరేషన్, మందులు లేకుండా మోకాళ్ల నొప్పులు తగ్గించవచ్చని తెలిపారు. మోకాళ్ల నొప్పులు తగ్గడానికి యుబీ 40 అనే నాడీ కేంద్రం వద్ద ఒత్తిడి చేయడం వలన నొప్పులు తగ్గించగలుగుతామని వివరించారు. ప్రతీ ఒక్కరు ఆక్యుపంక్చర్‌పై అవగాహన పొందితే ఆరోగ్య సమస్యలు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. శిబిరంలో 50 మందికి ఉచిత వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆలవాల రవి, విజయ్‌సాయి రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని భవానీపురం 42వ డివిజన్‌లో కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి ఆధ్వర్యాన శుక్రవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ వైఎస్సార్ పార్క్‌లో డివిజన్ మహిళలతో కలిసి చైతన్యరెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం మహిళల సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భవానీ ఐలాండ్‌లోని అమరావతి బోటింగ్ క్లబ్ (ఏబీసీ)లో శుక్రవారం నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏబీసీ సహ వ్యవస్థాపకురాలు, ఎండీ పవిత్ర కాకాని హాజరై కేక్ కట్ చేశారు. సంస్థలోని మహిళా ఉద్యోగులతోపాటు సీనియర్లు, ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను గుర్తించి సత్కరించారు. వారు మాట్లాడుతూ విజయవాడ భవానీ ద్వీపం, దుర్గా ఘాట్‌లో బోటింగ్ సేవలను పొందే మహిళలకు ఫ్లాట్ 20 శాతం తగ్గింపును ప్రకటించారు.



వైఎస్సార్ పార్క్‌లో జరిగిన మహిళా దినోత్సవంలో కార్పొరేటర్ చైతన్యరెడ్డి



ఏబీసీ మహిళా ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేస్తున్న పవిత్ర కాకాని

సీఆర్‌పీఎఫ్ బలగాలతో కవాతు

రామవరప్పాడు: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు నుంచి రామవరప్పాడు వరకు జాతీయ రహదారిపై శుక్రవారం పటమట పోలీస్‌స్టేషన్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు డీసీపీ అదిరాజ్‌సింగ్ రాణా పర్యవేక్షణలో సెంట్రల్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ భాస్కర్‌రావు నేతృత్వంలో శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం కవాతును నిర్వహించారు. ఎటువంటి అవాంఛిత సంఘటనలు చోటు చేసుకోకుండా మేమున్నామన్న భరోసా ప్రజలకు కల్పిస్తూ ఫ్లాగ్ మార్చ్ జరిగింది. పటమట సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐలు వల్లి పద్మ, దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



అనాథ పిల్లలకు అన్నదానం

పెనమలూరు: పోరంకి గ్రామంలో అనాథ బాలలకు శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రభునగర్‌లో ఉన్న నవరత్నం అనాథ ఆశ్రమంలో పిల్లలకు మహాశివరాత్రి సందర్భంగా తాడిగడప గ్రీన్ సిటీ డెవలప్‌మెంట్ కమిటీ అన్నదానం చేసింది. మానవసేవే మాధవసేవగా ఈ కార్యక్రమాన్ని చేశామనికమిటీ అధ్యక్షుడు అయినపురపు శేషగిరిరావు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, ట్రెజరర్ టి.సాయినాథ్, కమిటీ సభ్యులు రవి, కె.వెంకట్రావు, అన్నాబత్తుల సురేష్, ఎండీ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖాజీల పదవీకాలం పెంపుదల హర్షణీయం

కంకిపాడు: ప్రభుత్వ ఖాజీల పదవీకాలం పెంపుదల చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడం హర్షణీయమని కంకిపాడు మండల ప్రభుత్వ ఖాజీ హఫీజ్ మహమ్మద్ ఆరిఫ్ అన్నారు. గోసాల సెంటరులోని ఆయన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కడపలో జరిగిన ప్రభుత్వ ఖాజీల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాషా చేతుల మీదుగా ఖాజీల పదవీకాలం పదేళ్లకు పెంపుదల చేస్తూ జారీ చేసిన జీఓ ఎంఎస్ 36 ప్రతులను అందుకున్నామన్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జీవో ప్రకారం 2031 వరకూ తాము పదవిలో కొనసాగుతామని ఆనందం వ్యక్తం చేశారు.